

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఇండియా–1 ఏటీఎంలో చోరీకి విఫలయత్నం జరిగింది. 12లో▸



జయప్రదం చేయండి

షాద్‌నగర్‌లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య కోరారు. 12లో▸



బాధలు మిగిల్చి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు పదేపదే చెబుతున్నా పట్టించుకోకపోవడంతో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. 12లో▸

న్యూస్‌రీల్

లబ్ధిదారుల వివరాలు పక్కాగా ఉండాలి

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి



ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు సరి చూస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణం, మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో, మండలంలోని మోకిల పంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత పల్లె ప్రకృతివనం, నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. మోకిల తండాలో ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తమకు కేటాయించిన పనిని పక్కాగా చేయాలని అధికారులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఏపీఓ నాగభూషణం, మోకిల సెక్రెటరీ ఎల్లయ్య, మోకిల తండా సెక్రెటరీ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం

రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్



షాద్‌నగర్ డిపోను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సంతోష్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యమని రీజినల్ మేనేజర్ (ఆర్‌ఎం) సంతోష్ కుమార్ అన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ఉద్యోగులు, కార్మికులు తమవంతుగా తోడ్పాటు అందించాలని కోరారు. ఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలోని బస్టాండ్, పరిసరాలను పరిశీలించి మొక్కలు నాటారు. గేట్ మీటింగ్ ఏర్పాటుచేసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీకి మూల స్తంభాలుగా ఉన్న ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని అన్నారు. ప్రయాణికులు కోరినచోట బస్సును ఆపితే సంస్థకు మరింత ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ఎంతో సురక్షితమని, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు ఎంతో క్షేమంగా చేరవేస్తారని అన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించడం ద్వారా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆర్టీసీలో అనుభవం కలిగిన డ్రైవర్లు ఉంటారని, ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా బస్సులను నడుపుతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం లక్ష్మీధర్మసాగర్, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజనీర్ నాగులు, వెల్ఫేర్ బోర్డు సభ్యురాలు జ్యోతి, ఎస్‌డీఐ అర్జున్‌కుమార్, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి లగోరి రాష్ట్రస్థాయి పోటీలు



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనంతగిరి: హైదరాబాద్‌లోని ఉప్పల్ సృజన ఉన్నత పాఠశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు 8వ రాష్ట్ర స్థాయి సీనియర్ లగోరి మీట్ నిర్వహించనున్నట్లు లగోరి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు వికారాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు వస్తారని తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అమరేందర్‌రెడ్డి, శివరాజుగౌడ్, రమేష్‌కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎటాక్

పిండేస్తున్న గుండె

- పెరుగుతున్న హృద్రోగ బాధితులు
- కష్ట జీవుల్లోనూ గుండె జబ్బులు
- చిన్న వయసులోనే ఎఫెక్ట్
- 36 నుంచి 55 ఏళ్లలోపు వారే అధికం
- మారిన జీవశైలి, పని ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్లే కారణం అంటున్న వైద్యనిపుణులు
- ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 3,191 మందికి చికిత్సలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శరీరానికి కనీస వ్యాయామం లేని మధ్య, ఆపై తరగతి ప్రజల్లోనే కాదు రోజంతా కాయకష్టం చేసే నిరుపేదలు సైతం గుండె జబ్బుల బారినపడుతున్నారు.. 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు ఆరోగ్యశ్రీ పథకంలో జరిగిన చికిత్సలను పరిశీలిస్తే.. జిల్లాలో నిరుపేదల్లో హృద్రోగుల సంఖ్య ఏ విధంగా పెరుగుతుందో తెలుస్తోంది. కేవలం ఏడాది కాలంలోనే 3,191 మంది గుండె సంబంధిత చికిత్సలు చేయించుకోవడం గమనార్హం. ఇక సీఎంఆర్ఎఫ్, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్, ఈఎస్‌ఐ, ఆర్టీసీ, రైల్వే ట్రాన్స్‌కో, జెన్‌కో వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ, ఐటీ, దాని అనుబంధ సంస్థల్లో పని చేసే కార్పొరేట్ ఉద్యోగుల్లోనూ ఈ సమస్యలు అనూహ్యంగా పెరిగినట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. హృద్రోగ బాధితుల్లో 60 శాతం మంది మధ్య వయస్కులే ఉండటం గమనార్హం.

వ్యత్యాసం లేదు

జీవన శైలి, ఆహారం విషయంలో మధ్యతరగతి ప్రజలకు.. నిరుపేదలకు పెద్ద తేడా లేదు. ఆర్థికంగా అంతో ఇంతో నిలదొక్కుకున్న వర్గాల్లోనే కాదు.. వెనుకబడిన వారిలోనూ మాంసం, మద్యం, ధూమపానం వంటి అలవాట్లు ప్రస్తుతం సర్వసాధారణమయ్యాయి. అధిక రక్తపోటు, మధుమేహ బాధితులు కూడా భారీగా ఉన్నారు. విటమిన్ల లోపం, ఇన్‌ఫెక్షన్లు కూడా ఈ వర్గంలో గుండె జబ్బులు పెరగడానికి మరో కారణం. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం పేదల్లోనూ ఆరోగ్య స్పృహ పెరిగింది. పట్టణ ప్రాంతాల్లోనే కాదు.. మారుమూల మండల కేంద్రాల్లోనూ కార్డియాలజీ సెంటర్లు వెలిశాయి. ఆయా కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

ఒత్తిడితోనే గుండెకు చిల్లు

గ్లోబలైజేషన్, ఆర్థిక సరళీకరణ విధానాలతో నగరానికి ఆనుకుని ఉన్న జిల్లాకు విదేశీ పెట్టుబడులు భారీగా వచ్చి చేరాయి. ఐటీ దాని అనుబంధ కంపెనీల్లో పని చేస్తున్న వారితో పాటు మార్కెటింగ్ విభాగంలో పని చేస్తున్న వారికి ఆయా కంపెనీలు టార్గెట్లు పెడుతున్నాయి. వీటిని పూర్తి చేసేక్రమంలో ఆయా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి రక్తపోటుకు, మధుమేహానికి కారణమవుతున్నాయి. వేళకు తినకపోవడం, అది కూడా రెడీమేడ్‌గా లభించే మసాల వేపుళ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలు ఎక్కువ తీసుకోవడం, శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడంతో హృద్రోగ సమస్యలు తలెత్తుతున్నాయి. మధ్య తరగతిలో సరదాగా మొదలైన ధూమపానం.. మద్యపానం క్రమంగా ఓ వ్యసనంగా మారుతోంది. ఫలితంగా ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత వెలుగు చూసిన గుండె జబ్బులు ఇటీవల పాతికేళ్ల లోపే వెలుగు చూస్తుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు గుండె చికిత్సలు

వయసు	చికిత్సలు
14 ఏళ్లలోపు	100
15 నుంచి 25	32
26 నుంచి 35	126
36 నుంచి 45	547
46 నుంచి 55	1,011
56 నుంచి 65	839
66 ఏళ్లు పైబడిన వారు	536

ఈ జాగ్రత్తలు మేలు

- కొవ్వు పదార్థాలకు బదులు సాధ్యమైనంత వరకు ఆహారంలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- రక్తపోటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకునేందుకు రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా విటమిన్ లోపాన్ని అధిగమించొచ్చు.
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను మెరుగుపర్చుకోవడం ద్వారా ఇన్‌ఫెక్షన్లను అధిగమించొచ్చు.
- మద్యం, మాంసం, ఇతర కొవ్వు పదార్థాలకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.
- పార్కులు, ఇతర ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు.

– డాక్టర్ ఏజీకే గోఖలే, గుండె మార్పిడి నిపుణుడు

రోడ్డు గాల్లో నుంచి ఊడి పడిందా..?

- మీకు తెలియకుండా పనులెలా జరుగుతాయి?
- పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌పై హైడ్రా కమిషనర్ అసహనం
- కుంట్లూరు చెరువు పరిధిలో వేసిన రోడ్డు పరిశీలన



మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హయత్‌నగర్: పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్ చెరువు పరిధి నుంచి వేసిన రోడ్డును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్డు నిర్మిస్తున్నారనే ఫిర్యాదుతో రెండు రోజులుగా హైడ్రా, మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. సర్వేను పరిశీలించేందుకు బుధవారం హైడ్రా కమిషనర్ చెరువు వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వేయడానికి గతంలో మున్సిపాలిటీ తీర్మానం చేసిందని, ఆ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకోకుండా రోడ్డు నిర్మాణానికి ఎలాంటి టెండర్ పిలవలేదని, వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని, థర్డ్ పార్టీ వారు రోడ్డు వేశారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. దీంతో ఆగ్రహించిన రంగనాథ్ థర్డ్ పార్టీ ఎవరు.. వారు రోడ్డు వేస్తుంటే వారిపై కేసు పెట్టి చర్యలు తీసుకోవాలి కదా అని నిలదీశారు. మున్సిపాలిటీలో ఎలా అంటే అలా తీర్మానం చేస్తారా.. మీరు వేయకుండా రోడ్డు గాలిలో నుంచి ఊడిపడిందా.. అంటూ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరువును పూర్తిగా సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేస్తామని, చెరువు పరిధిలో వేసిన రోడ్డును తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సిబ్బందిని ఆదేశించారు. రైతులకు రోడ్డు కావాలంటే చెరువు హద్దు వెంట వేసుకోవాలని, చెరువులో ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని సూచించారు.

‘మార్ఫింగ్’ బ్లాక్‌మెయిల్!

- ముగ్గురు యువకులను చితకబాదిన బాధితురాలి భర్త, బంధువులు
- ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో ఘటన



గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సాయి, సురేష్

ఇబ్రహీంపట్నం: వరుసకు సోదరులైన వారే.. ఓ వివాహిత ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగామ్‌లో పెడుతామని బ్లాక్‌మెయిల్‌కు యత్నించారు. విషయాన్ని ఆమె తన భర్తకు చెప్పడంతో బంధువులతో కలిసి చితకబాదారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (21) సమీప బంధువైన (వరుసకు సోదరుడు) సురేష్‌తో కలిసి దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగామ్‌లో పెడతామని తొర్రూర్ గ్రామానికి చెందిన సాయి, విజయ్ (వీరు కూడా వరుసకు సోదరులే) బ్లాక్ మెయిల్ చేశారు. విషయాన్ని బాధితురాలు తన భర్త రాఘవేందర్‌కు తెలియజేసింది. దీంతో సురేష్, సాయి, విజయ్‌కు ఫోన్ చేసిన రాఘవేందర్ మాట్లాడుకుందాం రమ్మంటూ నాగన్‌పల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రానికి పిలించాడు. అప్పటికే అక్కడ ఉన్న రాఘవేందర్ బంధువులు ఎన్.రాములు, కుమరయ్య, యాదమ్మ, విజయ్, సాయి, భరత్‌పై దాడికి పాల్పడ్డారు. కర్రలు, వైర్లతో ఇష్టానుసారం కొట్టారు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

పోటీలో విద్యార్థుల ‘ప్రతిభ’

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ మాథ్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభాపాటవ పరీక్షలు బుధవారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీవైఎస్‌వైఎస్‌వై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ పోటీ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి తెలుగు, ఇంగ్లిష్ మీడియం నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున పాల్గొన్నారు. రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నక్క శ్రీనివాస్ యాదవ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ , డీసీఈబీ కార్యదర్శి అరుణ్, జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా చూస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ ప్రారంభోత్సవం, సంక్షేమ హాస్టళ్ల తనిఖీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడారు. మండల స్థాయి నుంచి ఇద్దరు, మున్సిపాలిటీల నుంచి నలుగురు చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈనెల 14న జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలో చేపట్టే డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రతి విద్యా సంస్థలో తాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం చేపట్టాలని, తల్లిదండ్రులకు సమాచారం అందించాలని, విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మార్కెట్ అభివృద్ధికి చర్యలు



హమాలీలకు గుర్తింపుకార్డులు, లైసెన్స్‌లు అందజేస్తున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

గడ్డి అన్నారం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లోని హమాలీలకు న్యాయం జరిగేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌లో బుధవారం పాలకవర్గం 2వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నదే పాలకవర్గం ఉద్దేశమని అన్నారు. అందరి సహకారంతో మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. మార్కెట్ పరిధిలోకి వచ్చే రైతు బజార్లు, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి సమస్యలు గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నో ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు గుర్తింపు కార్డులు, లైసెన్స్ సదుపాయాలు లేవని, వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని 65 మంది హమాలీలకు గుర్తింపు కార్డులతో పాటు లైసెన్స్‌లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కరా చారి, డైరెక్టర్లు అంజయ్య, రఘుపతి రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, గణేశ్ నాయక్, లక్ష్మి, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, నరసింహ, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్లాట్లు.. లాటరీకి ఏర్పాట్లు

- ఫార్మాసిటీకి భూములిచ్చిన 5,720 మంది రైతులు
- పరిహారంతోపాటు 620 ఎకరాల్లో టీజీఐఐసీ వెంచర్
- లాటరీ విధానంలో జరగనున్న ప్లాట్ల కేటాయింపు
- నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం



మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లో జోరుగా సాగుతున్న అభివృద్ధి పనులు

యాచారం: ఫార్మా ప్లాట్లకు లాటరీ ద్వారా నంబర్లు కేటాయించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏ స్థలంలో ఏ నంబర్ తగులుతుందోనని లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. వారం, పది రోజుల్లో కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేటలో లాటరీ నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారం క్రితం మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లోని ఫార్మా ప్లాట్ల స్థలాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించిన తర్వాత పనులను వేగవంతం చేశారు. బీఆర్ఎస్ హయాంలో యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించింది తెలిసిందే. ఈ మేరకు 13,500 ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూమిని సేకరించింది. అసైన్డ్ పట్టాదారులకు ఎకరాకు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు రూ.7.70 లక్షలు, పట్టా భూములకు రూ.12.50 లక్షల పరిహారం అందజేశారు. భూసేకరణ ప్రక్రియ 2017లో ప్రారంభం కాగా మొదట్లో ఏ ఇబ్బందీ రాలేదు. 2021 తర్వాత వ్యతిరేకత ప్రారంభమైంది. దీంతో రైతులకు పరిహారంతో పాటు ఎకరా భూమిని కోల్పోయిన వారికి 121 గజాల ప్లాటు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. పట్టా భూములకు ఎకరాకు రూ.16 లక్షల పరిహారం పెంచింది.



మహిళా రైతుకు ఇచ్చిన సర్టిఫికెట్ (ఫైల్)

5,720 మందికి ప్లాట్ల సర్టిఫికెట్లు

ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు కందుకూరు మండలం మీరాఖాన్‌పేట, పంజాగూడ గ్రామాల పరిధిలో టీజీఐఐసీ 620 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేసింది. రెండేళ్ల క్రితమే అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడక కొనసాగాయి. తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం.. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం వెంచర్ సమీపంలోనే కొద్ది నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడంతోపాటు ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే వెంచర్‌ను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 5,720 మంది రైతులకు ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇంకా 5,833 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఆ రైతులకు కూడా ప్లాట్లు ఇచ్చేందుకు అదనంగా 150 ఎకరాల్లో వెంచర్‌ను విస్తరించనున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం

సర్టిఫికెట్లు పొందిన 5,720 మంది లబ్ధిదారుల్లో కొంతమంది నకిలీలను గుర్తించారు. నిజమైన రైతులకే లాటరీ తీయనున్నారు. ప్లాట్లకు నంబర్లు కేటాయించిన తర్వాత మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం టీజీఐఐసీనే భరించనుంది. మరోవైపు మీరాఖాన్‌పేటలోని వెంచర్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. వారం రోజులుగా రోడ్డు అభివృద్ధి పనులు, ప్లాట్లకు నంబర్లు వేయడం, హద్దురాళ్లు పాతడం వంటి పనులు వేగవంతం చేసినట్టు టీజీఐఐసీ శంషాబాద్ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

త్వరలో లాటరీ ప్రక్రియ



ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇది వరకే ఇచ్చిన ప్లాట్లకు త్వరలో లాటరీ తీసి నంబర్లు కేటాయిస్తాం. త్వరలో మీరాఖాన్‌పేట్‌లోని టీజీఐఐసీ వెంచర్‌లో కలెక్టర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఎమ్మెల్యేలు, టీజీఐఐసీ అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ ఉంటుంది.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

మహాసభలను జయప్రదం చేయండి


మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

టీఎస్‌యూటీఎఫ్
జిల్లా కార్యదర్శి వెంకటయ్య

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో ఈ నెల 14, 15న నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం పట్టణంలోని ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటుగా ప్రభుత్వ విద్యాపరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. మొదటి రోజు 14న నిర్వహించే బహిరంగ సభలో విద్యా పరిరక్షణకు వక్తలు తగు సూచనలు, సలహాలను అందిస్తారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింలు, చంద్రశేఖర్, సత్యం, బాలయ్య, కృష్ణ, అరుణ, సమత, లక్ష్మీదేవమ్మ, మంజుల, భరత్‌కుమార్, సురేందర్, వేణు, బుద్దదేవ్, సత్యం, ప్రదీప్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఇండియా–1 ఏటీఎంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఇండియా–1 ఏటీఎం సెంటర్‌లోకి అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఏటీఎం సెంటర్‌లో ఉన్న మిషన్ సేఫ్ లాకర్‌ను విరగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. విషయం తెలియడంతో బుధవారం ఉదయం ఏటీఎం సెంటర్‌ను ఎస్ఐ వెంకటేశ్, క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఏటీఎం సెంటర్ వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

బిగ్‌బాస్ ఫైనల్‌కు భారీ భద్రత

- 53 కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచన
- గత అనుభవాల దృష్ట్యా అడుగడుగునా నిఘా నేత్రాలు

బంజారాహిల్స్: ఈ నెల 15వ తేదీన బిగ్‌బాస్ సీజన్–8 ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఇందుకోసం గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అల్లర్లు, గొడవలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–5లోని అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల్లో బిగ్‌బాస్ సెట్టింగ్ వేయగా..ఫైనల్ కూడా ఇక్కడే జరగనుంది. గత ఏడాది డిసెంబర్ 17వ తేదీన బిగ్‌బాస్ సీజన్–7 ఫైనల్ సందర్భంగా తలెత్తిన పరిణామాలు, గొడవలు, బస్సులపై రాళ్ల రువ్వడం తదితర అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. అన్నపూర్ణ స్టూడియో చుట్టూ 53 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఇప్పటికే పోలీసులు ఆయా పాయింట్లతో కూడిన జాబితాను అన్నపూర్ణ స్టూడియో, బిగ్‌బాస్ యాజమాన్యానికి అందజేశారు. గత ఏడాది ఫైనల్ సందర్భంగా పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకున్న అభిమానులు ఒక సందర్భంలో బస్సులపై రాళ్లు రువ్వి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడగా అప్పటి బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌తో పాటు బిగ్‌బాస్, అన్నపూర్ణ స్టూడియో యాజమాన్యంపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. దాడికి పాల్పడ్డ వారిని గుర్తించడంలో పోలీసులకు చాలా ఇబ్బందులు తలెత్తాయి. ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో చాలామంది తప్పించుకున్నారు. ఈసారి ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే గుర్తించేందుకు వీలుగా బిగ్‌బాస్ షో జరిగే స్టూడియో చుట్టూ 53 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ కెమెరాలు ఏర్పాటుచేయాలో జూబ్లీహిల్స్ పోలీసులు ఆ పాయింట్లను బిగ్‌బాస్ యాజమాన్యానికి అందజేశారు. ఈ నెల 14వ తేదీన ఉదయమే వీటిని అమర్చుకోవాలని సూచించారు. వారం క్రితం యూసుఫ్‌గూడ స్టేడియంలో జరిగిన పుష్ప–2 ప్రీ రిలీజ్ ఫంక్షన్ సందర్భంగా నిర్వాహకులు 60 తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆ రోజు జరిగిన కార్యక్రమంలో భారీగా అభిమానులు రావడంతో 15 మొబైల్ ఫోన్లు, రెండు బంగారు గొలుసులు చోరీకి గురయ్యాయి. చోరులను గుర్తించేందుకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిగ్‌బాస్ సీజన్–8 ఫైనల్ సందర్భంగా కూడా చుట్టూ 53 కెమెరాలను ఏర్పాటు చేస్తే పోలీసులకు ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు.


బిగ్‌బాస్ షో జరుగుతున్న అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాలు

పరువునష్టం కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరుకాగా ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు హాజరుకాగా రేవంత్‌రెడ్డి తరుపు న్యాయవాది క్రాస్‌ఎగ్జామినేషన్ చేశారు. పిటిషనర్‌తోపాటు సాక్షి క్రాంతికుమార్ హాజరు అయ్యారు. అనంతరం తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

మాడ్గుల: మండలంలోని అందుగుల గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఎర్రమట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ జగదీశ్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ప్రశ్నించగా.. ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాధ్యత మరిచి.. బాధలు మిగిల్చి

చేతికొచ్చిన కొడుకులు తమ కష్టసుఖాల్లో అండగా నిలుస్తారని ఆశ పడుతున్న పలువురు తల్లిదండ్రులకు గర్భశోకమే మిగులుతోంది. హెల్మెట్ ధరించి, వాహనం నడపాలనే నిబంధనను యువత పట్టించుకోకపోవడంతో.. యాక్సిడెంట్ల బారిన పడి అనంతలోకాలకు చేరుతున్నారు.



- హెల్మెట్ ధరించక.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- వారం వ్యవధిలోనే ఇద్దరు యువకుల దుర్మరణం

మంచాల: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు పదే పదే చెబుతున్నా పట్టించుకోకపోవడంతో నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు విగత జీవులుగా మారుతున్నారు. చేతికి వచ్చిన బిడ్డలు రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోవడంతో బాధిత తల్లిదండ్రులు కడుపుకోత అనుభవిస్తున్నారు.

- మండలంలోని లింగంపల్లిగేట్ వద్ద ఈ నెల 3న ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్న సంఘటనలో యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం కడీలబావి తండాకు చెందిన కారంటోత్ మహేశ్(23) దుర్మరణం పాలయ్యాడు.
- ఆగాపల్లి వద్ద ఈనెల 9న ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును హెల్మెట్ లేకుండా అతి వేగంగా వచ్చి బైక్ ఢీకొన్న సంఘటనలో నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రానికి చెందిన కొమ్ము ప్రశాంత్‌కుమార్(24) తీవ్రంగా గాయపడి మృతిచెందాడు.
- పైరెండు ఘటనల్లో హెల్మెట్ ధరించి ఉండే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పోలీసులు తెలిపారు. మృతులది రెక్కాడితేగాని డొక్కాడని బీద కుటుంబాలు. చేతికి వచ్చిన కొడుకులు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో విలపిస్తున్నారు.

కఠినతరం చేయాలి



గ్రామాల్లో కూడా పోలీసులు నిబంధనలు కఠినతరం చేయాలి. చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. బైక్ నడిపే వారు తలకు హెల్మెట్ తప్పనిసరి చేయాలి. నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.
– విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఆరుట్ల

చర్యలు తీసుకుంటాం



ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని పదేపదే చెబుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు. దీనిపై యువతకు అవగాహన కల్పిస్తున్నాం. నిర్లక్ష్యంగా బైక్‌లు నడిపి కన్నవారికి శోకాన్ని మిగిలించొద్దు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– మధు, సీఐ, మంచాల

ఫార్మసిస్టులు నైపుణ్యం పెంచుకోవాలి

ఔషధ నియంత్రణ శాఖ
డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: ఫార్మసిస్టులు ప్రపంచంలోని ప్రజలందరికి ఉపయోగపడేలా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలో భాస్కర ఫార్మసీ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నాలుగు రోజుల పాటు కళాశాల కార్యదర్శి జె.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల నుంచి 30 మంది ఫార్మసిస్టులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అన్ని వృత్తి విద్యల్లో ఫార్మసీ కీలకమన్నారు. ఫార్మసిస్టులు ఆరోగ్య నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తారని సూచించారు. ఫార్మసీ విద్య వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ సుధీర్‌కుమార్, జె.బి.ఎడ్యూకేషన్ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సంజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రమణ, డాక్టర్ కిశోర్‌బాబు, డాక్టర్ ఉదయ్‌చంద్రిక, శిక్షణ ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.


అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల బృందం

హాస్టల్ వార్డెన్ అదృశ్యం

మొయినాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన హాస్టల్ వార్డెన్ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వసంత్ రెడ్డి అదే గ్రామంలో ఉన్న స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల హాస్టల్లో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 9న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయన ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య నవిత బుధవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి కింద పడి వ్యక్తి దుర్మరణం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నందిగామ: రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని పార్శిగామికవాడలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని హెచ్‌బీఎల్ రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి(30) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందకు జారిపడి దుర్మరణం చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి ఎడమ చేయిపైన ×ప్రియాంక్ష అనే పచ్చబొట్టు ఉందని, ఎరుపు రంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కుంగదీసిన కేన్సర్

మానసిక వేదనతో
వృద్ధ దంపతుల ఆత్మహత్య

ఉప్పల్: భార్యకు కేన్సర్ అని తేలడంతో భర్త తల్లడిల్లాడు. అనారోగ్యంతో భార్య రోజురోజుకు కుంగిపోతోంది. ఈ పరిస్థితుల్లో మానసిక వ్యధకు గురైన ఇద్దరు వృద్ధ దంపతులు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..చిలుకానగర్ డివిజన్ ధర్మపురి కాలనీకి చెందిన దుర్వాసుల సూర్యనారాయణ శాస్త్రి(60), జగదీశ్వరి(56) భార్యాభర్తలు. వీరి ఏకైక కుమారుడు సుశాంత్ గచ్చిబౌలిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల జగదీశ్వరి కేన్సర్ వ్యాధికి గురైంది. దీంతో భార్యా భర్తలిద్దరూ తీవ్రంగా కలత చెందారు. ఈ క్రమంలో ఈ నెల 3న సూర్యనారాయణ శాస్త్రి తన కుమారుడికి ఫోన్ చేసి తాను ఓ సెమినార్ కోసం బయటకు వెళ్తున్నానని, అమ్మను కూడా తీసుకెళ్తున్నాను..నాలుగు రోజుల వరకు రాను అని చెప్పాడు. ఆ తర్వాత వారం రోజులుగా ఎలాంటి ఫోన్ రాకపోవడంతో బుధవారం కుమారుడు తండ్రికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. సెమినార్‌కూ వెళ్లలేదని తెలిసింది. దీంతో హుటాహుటిన బుధవారం ఉదయం ఉప్పల్‌లోని ఇంటికి వచ్చి చూడగా గేట్‌కు తాళం వేసి ఉంది. పనిమనిషికి ఫోన్ చేసి పిలిపించి తాళం తీసి ఇంట్లోకి వెళ్లగా ఇంటి తలుపులు లోపలి నుంచి లాక్ చేసి ఉన్నాయి. కిటికీలోంచి చూడగా దుర్వాసన రావడంతో వెంటనే తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే కుళ్లిన స్థితిలో మృతదేహాలు పడి ఉన్నాయి. మృతదేహాల పక్కన, ఇంకా రెండు చోట్ల మూడు సూసైడ్ నోట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'అనారోగ్య కారణాల చేత సూసైడ్ చేసుకుంటున్నాం. మా చావులకు ఎవరూ కారణం కాదు' అంటూ రెండు లైన్లు తెలుగులో నోట్ రాసి ఉంది. దీంతో కుమారుడు సుశాంత్ ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా వారం రోజుల క్రితమే వృద్ధ దంపతులు గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

పెట్రోల్ ట్యాంకర్‌లోంచి ఎగిసిపడిన మంటలు

- సకాలంలో ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరిపీల్చుకున్న పోలీసులు, స్థానికులు

నాంపల్లి: అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన ఓ పెట్రోల్ ట్యాంకర్‌లోంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరువలో ఏక్ మినార్ మసీదుకు ఎదురుగా ఉండే పెట్రోఫినా ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏక్ మినార్ మసీదు ఎదురుగా ఓ పెట్రోల్ బంకు ఉంది. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సంస్థకు చెందిన ట్యాంకర్ పెట్రోల్‌తో అక్కడికి చేరుకుంది. పెట్రోల్‌ను అన్‌లోడ్ చేసేందుకు బంకు వద్ద ట్యాంకర్‌ను పార్కింగ్ చేశారు. హెచ్‌పీసీఎల్ ట్యాంకర్‌లో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పెట్రోల్‌ను అన్‌లోడ్ చేసేందుకు సిబ్బంది ట్యాంకర్ పైభాగంలోని రెండు మూతలను తెరిచారు. మూడో మూతను తెరిచే క్రమంలో ట్యాంకర్ ఒక్కసారిగా నుంచి మంటలు చెలరేగాయి. ఉవ్వెత్తున ఎగిసిపడే మంటలను చూసిన సిబ్బంది, స్థానికులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ట్యాంకర్ లోపలి భాగంలో ఉన్న పెట్రోల్‌కు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ యుగంధర్ ప్రసాద్, నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌లు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

చాకచక్యంగా మంటలను ఆర్పడంతో..

అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంతో మంటలను వెంటనే అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. లేదంటే ట్యాంకర్‌లోని పెట్రోల్ పూర్తిగా అంటుకుని పక్కనే ఉన్న పెట్రోల్ బంకుకు మంటలు వ్యాపించేవి. ఫలితంగా మంటలు అర్పడానికి చాలా సమయం పట్టేంది. దీనితోడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేది.

అంతు చిక్కని రహస్యం..

ట్యాంకర్ నుంచి మంటలు ఎలా వ్యాపించాయనేది పోలీసులకు అంతు చిక్కడం లేదు. మంటలు వ్యాపించడానికి కారణాలను తెలుసునేందుకు ట్యాంకర్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపారు.

కారు అదుపుతప్పి నలుగురికి తీవ్ర గాయాలు

కేశంపేట: కారు అదుపుతప్పి నలుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండల పరిధిలోని కేసీతండాకు చెందిన హేమ్లానాయక్ లక్ష్మీ, రెడ్యానాయక్ సరోజ దంపతులు కేశంపేటలో శుభాకార్యానికి కారులో వచ్చి తిరిగి వెళ్తుండగా బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన షురూ

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. ఈమేరకు ప్రజాపాలనలో గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లోని 150 వార్డుల నుంచి 10,40,537 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులోని 8 వార్డుల నుంచి 29,909.. మొత్తంగా 10,70,446 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు సర్వేయర్లు, మానిటరింగ్, సూపర్‌వైజింగ్ ఆఫీసర్లను జీహెచ్‌ఎంసీ నియమించింది. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు ప్రతి వార్డుకు ఇద్దరు లేదా ముగ్గురి చొప్పున 150 వార్డులకు సర్వేయర్లను నియమించారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 5,00,822 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా సంగారెడ్డిలో 20,711 అప్లికేషన్లు వచ్చాయి. మేడ్చల్–మల్కాజ్‌గిరిలో 3,22,064, రంగారెడ్డిలో 1,96,940, కంటోన్మెంట్‌లో 29,909 దరఖాస్తులు వచ్చాయి.

పరువు నష్టం కేసులో విచారణకు 'బండి' గైర్హాజరు

సిటీ కోర్టులు: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసు విచారణకు ఆయన గైర్హాజరు అయ్యారు. 2022 అక్టోబర్‌లో మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా..దోపిడీ దొంగలుగా అభివర్ణించారని మంత్రి బండి సంజయ్‌పై పరువునష్టం కేసు నమోదవగా.. ప్రజాప్రతినిధుల కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ విచారణకు బండి సంజయ్ గైర్హాజరు కావడంతో కోర్టు జనవరికి వాయిదా వేసింది.